క్లుప్తంగా

మల్లయ్యకొండకు ప్రత్యేక బస్సులు

మదనపల్లె సిటీ: ప్రముఖ శైవక్షేత్రమైన తంబళ్లపల్లె మల్లయ్యకొండకు సోమవారం ప్రత్యేక బస్సు సర్వీసులు నడపనున్నట్లు ఆర్టీసీ-1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మదనపల్లె నుంచి ఉదయం 5, 6.30 గంటలకు మల్లయ్యకొండుకు బస్సులు వెళ్తాయన్నారు. తంబళ్లపల్లె నుంచి మల్లయ్యకొండకు సాయంత్రం వరకు షటిల్ సర్వీసులు నడుస్తాయన్నారు. భక్తులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించాలని కోరారు.

మార్జిన్ దాటితే జరిమానా
-సీఐ సూర్యనారాయణ

బి.కొత్తకోట: ట్రాఫిక్ క్రమబద్ధీకరణ కోసం చేపట్టిన చర్యలను ఉల్లంఘించే వారిపై జరిమానా విధిస్తామని సీఐ ఎస్.సూర్యనారాయణ ఆదివారం మీడియాకు తెలిపారు. పట్టణంలో సర్కిల్ ప్రాంతమైన జ్యోతిచౌక్‌లో రోడ్డుకు ఇరువైపులా వేసిన మార్జిన్ లోపలే బైక్‌లను నిలిపి ఉంచాలన్నారు. గీత దాటి పెట్టిన బైక్‌లపై జరిమానా విధిస్తామని తెలిపారు. బీరంగిరోడ్డులో కూడా ఇదే విధంగా నిబంధన పాటించాలని కోరారు. దుకాణాల యజమానులు బైక్‌లను నిలిపేవారికి ఈ నిబంధన వివరించాలని కోరారు. రోడ్లపై తోపుడుబండ్లను నిలిపి ఉంచరాదని స్పష్టం చేశారు. ట్రాఫిక్ కోసం ప్రత్యేకంగా పోలీసులను నియమిస్తున్నట్టు తెలిపారు.

చిట్టిప్రేమ పాటకు టీఎస్ఎఫ్ఏ అవార్డు



అవార్డు అందుకుంటున్న రామచరణ్

పీలేరు రూరల్ : పీలేరు పట్టణం ఎంజేఆర్ కళాశాలలో చదువుతున్న రామ్‌చరణ్, చాణిక్య చిత్రీకరించిన చిట్టిప్రేమ పాటకు టీఎస్ఎఫ్ఏ అవార్డు లభించింది. హైదరాబాద్‌లో మాదాపూర్‌లోని టి-హబ్‌లో జరిగిన కలారజ మీడియా వారి టీఎస్ఎఫ్ఏ (తెలుగు షార్ట్ ఫిల్మ్ అవార్డ్స్)లో అవార్డు అందజేశారు. సందర్భగా రామ్‌చరణ్ మాట్లాడుతూ తాము చిత్రీకరించిన చిట్టిప్రేమ పాట యూట్యూబ్‌లో 16 వేల మందికి పైగా వీక్షించారని తెలిపారు.

ఘనంగా సయ్యద్‌షావల్లి బాబా ఉరుసు



ప్రత్యేక అలంకరణలో సయ్యద్‌షావల్లి దర్గా

మదనపల్లె సిటీ: మదనపల్లె మండలం సీటీఎం లోని సయ్యద్‌నాధషావలీబాబా ఉరుసు ఘనంగా ఘనంగా జరిగింది. శనివారం రాత్రి కుల,మతాలకు అతీతంగా గ్రామ పెద్దలు, మత పెద్దలు గంధోత్సవాని నిర్వహించారు. బాబా మజ్జార్‌పై పూలచాదర్‌లతో, విద్యుత్ దీపాలతో అలంకరణ చేశారు. పురవీధుల్లో ఫకీర్లతో గుర్రపుబండ్లపై ఊరేగింపుగా గంధాన్ని తీసుకెళ్లారు. వేకువజామున మత పెద్ద బాబా జాన్ దర్గాలో బాబాకు గంధాన్ని అంకితమిచ్చారు. బాబా మజ్జార్ వద్ద కుల,మతాలకు అతీతంగా ప్రజలు హాజరై ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

విద్యార్థిని ఆచూకీ లభ్యం

బి.కొత్తకోట: కళాశాలకు వెళ్లి అదృశ్యమైన విద్యార్థి ఆచూకీ లభ్యమైందని సీఐ సూర్యనారాయణ ఆదివారం తెలిపారు. మండలంలోని కంబాలపల్లెకు చెందిన విద్యార్థిని అదృశ్యంపై తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. హైదరాబాద్‌లోని వనస్థలిపురంలో ఉన్నట్లు గుర్తించామని తెలిపారు.

90 శాతం లబ్ధిదారులకు ఇంటింటికీ బియ్యం

కలకడ : మండలంలో 90 శాతం కార్డు దారులకు నిత్యవసర సరుకులు ఎండియూ వాహనాల ద్వారా బియ్యం అందజేసినట్లు సివిల్‌సప్లై డిప్యూటీ తహసీల్దార్ కృపావతి తెలిపారు. ఆదివారం చివరి రోజూ కూడా పంపిణీ చేశారు. మండలంలో ఏడు యండియూ వాహనాల ద్వారా 11,161 మంది కార్డు దారులకుగాను 10,281 మందికి నిత్యావసరాలు అందజేసినట్లు తెలిపారు. బయటి కార్డుదారులకు 183 మందికి పంపిణీ చేసి 9 2శాతం పూర్తి చేసినట్లు వివరించారు. ఎండియూ వాహనం గ్రామానికి వచ్చిన రోజు కార్డు దారులు అందుబాటులో లేకున్నా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మరుసటిరోజు ఎక్కడ వాహనం ఉంటే అక్కడ నిత్యవసర సరుకులు పొందవచ్చునన్నారు. ప్రతి నెలా 17వతేదిన విధిగా సచివాయం వద్ద వాహనంలో నిత్యవసర సరుకులు అందుబాటులో ఉంటాయన్నారు. కార్డు దారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రజా సేవకులకు సత్కారం

- వరుసగా నాలుగో ఏడాది అవార్డులు
- ప్రభుత్వ పని తీరుకు వన్నె తెచ్చిన వలంటీర్లు



సేవ రత్న అవార్డును వలంటీర్‌కు అందిస్తున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి (ఫైల్)

వాల్మీకిపురం: పేదల కన్నీళ్లు తుడిచి సంక్షేమాన్ని ప్రతి ఇంటి ముంగిటకూ తీసుకొచ్చారు. నిస్సహాయ స్థితిలో ఉన్న అవ్వాతాతలకు ప్రతి నెలా ఒకటో తేదిన తలుపు తట్టి పింఛన్లు అందిస్తూ వలంటీర్లు కొత్త ఒరవడి సృష్టించారు. అలాంటి వలంటీర్ల సేవలకు గుర్తిస్తూ ప్రభుత్వం ఉత్తమ పురస్కారాలతో సత్కరిస్తోంది. వలంటీర్‌గా బాధ్యతలు తీసుకున్న వారంతా యువ సైనికుల్లా, సేవా వారధుల్లా నూతనోత్సాహంతో ముందుకు సాగుతున్నారు. వలంటీర్లు ఎప్పటికప్పుడు తమకు కేటాయించిన 50 కుటుంబాలను కలుస్తూ వారి అవసరాలు తెలుసుకుంటున్నారు. పింఛన్లతో పాటు అమ్మ ఒడి, ఆరోగ్యశ్రీ, వైఎస్సార్ భరోసా, డ్వాక్రా మహిళలకు వైఎస్సార్ ఆసరా, నాయీబ్రాహ్మణులు, దర్జీలు, రజకులకు ఆర్థిక సహాయం, వైఎస్సార్ చేయూత, రైతు భరోసా, ఇళ్ల స్థలాల పంపిణీ, పింఛన్లు ఇలా ఏ పథకానికి అర్హులో గుర్తించి లబ్ధిదారుల వివరాలతో గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేయిస్తున్నారు. కోవిడ్ విధుల్లో బాధ్యతగా పనిచేయడంతో దేశ వ్యాప్తంగా వలంటీర్ల వ్యవస్థకే పేరు తీసుకొచ్చారు. దీంతో గత మూడేళ్లుగా సంక్షేమ పథకాలను అర్హులకు చేరుస్తున్న వలంటీర్ల సేవలకు మెచ్చి ప్రభుత్వం ప్రతి పురస్కారాలు అందిస్తోంది. సేవా రత్నకు రూ.30 వేలు, సేవా మిత్రకు రూ.15 వేల చొప్పున ప్రోత్సాహక నగదు బహుమతిని అందజేయడంతో పాటు వలంటీర్లకు బ్యాడ్జి అందజేసి శాలువాతో సత్కరిస్తున్నారు.

సేవ చేయడం అదృష్టంగా భావిస్తా



వలంటీర్‌గా ప్రజలకు సేవ చేయడం సంతోషంగా ఉంది. సేవా రత్న అవార్డు రావడం మరింత సంతోషాన్ని ఇస్తోంది.నేను మూడు సార్లు సేవా మిత్ర అవార్డులు అందుకున్నాను. ప్రజలకు సేవ చేస్తూ ప్రభుత్వం నుంచి అవార్డు అందుకోవడం చాలా అదృష్టంగా భావిస్తున్నాను. వలంటీర్‌గా అవకాశం కల్పించిన ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డికి, సీఎం జగనన్నకు కృతజ్ఞతలు.

- గంగాధర, వలంటీర్, శివపురం, వాల్మీకిపురం

మరింత బాధ్యతగా సేవలందిస్తా



నేను మూడు సార్లు సేవా మిత్ర అవార్డులు అందుకున్నాను. నా సేవలు గుర్తించి ప్రభుత్వం ఇప్పుడు సేవా రత్న అవార్డు అందించడం సంతోషంగా ఉంది. సీఎం జగనన్న ఇచ్చిన ఈ ప్రోత్సాహంతో మరింత బాధ్యతగా సేవలు అందిస్తాను. వలంటీర్‌గా ప్రజలకు సేవ చేసే అవకాశం రావడం, లబ్ధిదారులు వారి కుటుంబ సభ్యునిగా చూడడం అదృష్టంగా భావిస్తున్నాను.

- రెడ్డిసునీత రాణి, వలంటీర్, బీదావాండ్లపల్లి, వాల్మీకిపురం

సేవ చేసే అవకాశం కలిగింది



మూడు సార్లు సేవా మిత్ర అవార్డులు అందుకున్నాను. ఇప్పుడు సేవా రత్న అవార్డు అందుకోవడం సంతోషంగా ఉంది. ప్రజలకు అందిస్తున్న సేవలను గుర్తించి ప్రభుత్వం ప్రతి ఏడాది వలంటీర్లకు అవార్డులు, నగదు ప్రోత్సాహకాలు అందిస్తుండటం గొప్ప విషయం. నా పరిధిలో కుటుంబాలకు మరింత మెరుగ్గా సేవలు అందించేందుకు కృషి చేస్తా.

- సతీష్ కుమార్, వలంటీర్, చింతలవారిపల్లి, వాల్మీకిపురం

పేద కుటుంబానికి పాల ఏకరి సంఘం అండ

- ఆడపిల్లల చదువు బాధ్యతల స్వీకరణ
- తక్షణ సాయంగా రూ.25వేలు అందజేత



పేద కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న జన్నే రాజేంద్రనాయుడు

మదనపల్లె : రోడ్డు ప్రమాదంలో కుటుంబపెద్ద చనిపోవడంతో, ఆర్థికంగా చితికిపోయి, కూతుళ్ల చదువులకు ఇబ్బందులు పడుతున్న ఓ కుటుంబాన్ని ఆదుకునేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పాల ఏకరి సేవాసమితి సంక్షేమ సంఘం ముందుకువచ్చింది. ఆదివారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షులు జన్నే రాజేంద్రనాయుడు, అనంతపురం జిల్లా గార్లదిన్నె మండలం కల్లూరు గ్రామానికి చెందిన నాగేంద్ర భార్య పద్మ, పిల్లలు సుధీష్ణ, రితికలకు రూ.25వేలు నగదును అందించారు. ఈ సందర్భంగా జన్నే రాజేంద్రనాయుడు మాట్లాడుతూ..కల్లూరు గ్రామానికి చెందిన నాగేంద్ర రోడ్డుపక్కన టిఫిన్ హోటల్ పెట్టుకుని భార్యాబిడ్డలను పోషించుకునేవాడన్నారు. 2023 నవంబర్ 28న గార్లదిన్నె కేజీబీవీలో చదువుతున్న పెద్దకుమార్తె సుధీష్ణను చూసేందుకు వెళ్లి, తిరిగి కల్లూరుకు వచ్చే క్రమంలో రోడ్డు ప్రమాదంలో చనిపోయాడన్నారు. కుటుంబం పెద్దదిక్కును కోల్పోవడంతో, ఆర్థికంగా ఇబ్బందులు పడ్డారన్నారు. పాల ఏకరి సేవాసమితి సంక్షేమ సంఘం సభ్యులందరూ కలిసి పేద కుటుంబాన్ని ఆదుకోవాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. అందులో భాగంగా ఆదివారం వారిని మదనపల్లెకు పిలిపించి తక్షణ సాయంగా రూ.25వేలు అందించామన్నారు. పిల్లలు సుధీష్ణ, రితిక చదువుల బాధ్యతను తామే తీసుకుంటామని, ఒప్పందపత్రం అందజేశారు. కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా అధ్యక్షులు జి.చలపతినాయుడు, చిత్తూరుజిల్లా అధ్యక్షులు యం.మల్లికార్జుననాయుడు, తిరుపతిజిల్లా అధ్యక్షులు రాజేంద్రప్రసాద్, సంఘనాయకులు హరిబాబు, చంద్రశేఖర్, సదాశివనాయుడు, రఘుపతినాయుడు, శ్రీనివాసులు నాయుడు పాల్గొన్నారు.

జల్‌జీవన్ మిషన్‌ద్వారా ప్రతిఇంటికి నీరు



నడిమిచెర్ల గ్రామంలో కుళాయిల కోసం పైపులైన్ ఏర్పాటు చేస్తున్న దృశ్యం

కలకడ : ప్రభుత్వం చేపట్టిన జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా గ్రామంలోని ప్రతి కుటుంబానికి మంచినీటిని అందించనున్నట్లు నడిమిచెర్ల సర్పంచ్ నల్లమ్మ నరసింహారెడ్డి తెలిపారు. నడిమిచెర్ల గ్రామంలో పంచాయతీ ఆధ్వర్యంలో ఉచిత మినిరల్‌వాటర్‌ను అందజేయడంతో పాటు రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకుని ఉన్న నీటిని ప్రతి ఇంటికి అందజేయనున్నట్లు తెలిపారు. అలాగే మంచినీరు చోరీకి అవకాశం లేకుండా ప్రతి వీధికి ఇనుప పైప్‌లైన్ ఏర్పాటు చేసి కుళాయిలు ఏర్పాటు చేశామన్నారు. వృద్ధులు, వికలాంగులు మంచినీటి కోసం వేచి చూడటం, దూరప్రాంతాల నుంచి తీసుకురావాల్సిన అవసరం ఉండదన్నారు. గ్రామంలో ఎత్తు-పల్లాలను సమానంగా తీసుకుని సమాంతరంలో కుళాయిలు ఏర్పాటు చేయాలని సిబ్బందిని ఆదేశించారు.

లక్ష్మీనరసింహ అవతారంలో లక్ష్మీజనార్దనస్వామి



లక్ష్మీనరసింహస్వామి అవతారంలో స్వామివారు

రామసముద్రం: మండల కేంద్రంలో వెలసిన అతిపురాతన లక్ష్మీజనార్దనస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం స్వామివారు శ్రీలక్ష్మీనరసింహ స్వామి అవతారంలో దర్శనమిచ్చారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు ఘనంగా నిర్వహించారు. చుట్టు ప్రక్కల ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని భక్తిశ్రద్ధలతో పూజించి మొక్కులు చెల్లించుకున్నారు. హాజరైన భక్తులకు ఆలయ అర్చకులు పార్థసారధిబట్టర్, కులశేఖర్‌బట్టర్‌లు తీర్థప్రసాదాలు అందజేశారు. సాయంత్రం స్వామివారికి ఊంజల్‌సేవ నిర్వహించారు. రాత్రి ఆలయం వద్ద సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా హరికథ నిర్వహించారు.

రెడ్డెమ్మకొండపై భక్తుల రద్దీ



సంతానం కోసం అమ్మవారి ఎదుట వరపడిన మహిళలు

గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన రెడ్డెమ్మతల్లి ఆలయం ఆదివారం భక్తుల రద్దీతో పోటెత్తింది. ఈసందర్భంగా ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు,అభిషేకాలు నిర్వహించారు. మహిళలు అమ్మవారి కోనేట్లో పవిత్ర స్నానమాచరించి అమ్మవారి ఎదుట సంతాన కోసం వరపడ్డారు. మొక్కులు తీరిన భక్తులు అమ్మవారికి బంగారు, వెండి, చీరేసారెలతో మొక్కులు చెల్లించుకొన్నారు. పలువురు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో తలనీలాలు సమర్పించారు. హిందువులతో పాటు పెద్ద ఎత్తున ముస్లింలు తరలివచ్చి అమ్మవారికి దర్శించుకోవడం గమనార్హం.

పద్మవ్యూహంలా మారిన ట్రాఫిక్



సతం వీధికి వెళ్లే దారిలో ద్విచక్రవాహనాలు అడ్డదిడ్డంగా ఉంచిన దృశ్యం

గుర్రంకొండ: పట్టణంలోని బస్టాండు, ఎన్‌హెచ్340 ప్రధాన రహదారి నుంచి పలు వీధులకు వెళ్లే దారులు మూసుకుపోతుండడంతో ప్రజలు, వాహన దారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బస్టాండు నుంచి సర్కారు బావి సందు మీదుగా సత్రంవీధి, బజారువీధికి వెళ్లే మార్గం మొత్తం కబ్జాకు గురైంది. దారి మొత్తం దుకాణాదారులు ఆక్రమించుకోవడంతో గతంలో ఆటోలు వెళ్లే మార్గం నేడు ప్రజల నడక దారి కూడా కనుమరుగు అయ్యింది. ఎన్‌హెచ్ 340 మెయిన్ రోడ్డు నుంచి కొత్తపేట, బలిజగడ్డ, తాళింవీధి, బజారువీధికి వెళ్లే ప్రధాన రహదారులు మొత్తం కబ్జాకు గుయ్యాయి. వీధులకు అడ్డంగా ద్విచక్రవాహనాలు అడ్డదిడ్డంగా ఉంచేస్తున్నారు. ఇదే మార్గంలో వందలాది మంది విద్యార్థులు ప్రతి రోజు పాఠశాలలకు వెళుతుంటారు. వేలాది మంది ప్రజలు ఇదే మార్గం నుంచి పట్టణానికిదిగువ నున్న దర్గావీధి, ఎల్లుట్ల గడ్డ, తాళింవీధి, ఖాజీవాడ, తహసీల్దార్ కార్యాలయంకు వెళుతుంటారు. అయితే కొంతమంది దారి మొత్తాన్ని ఆక్రమించుకొని వాహనాలు, దుకాణాలు ఇష్టానుసారం ఏర్పాటు చేసుకొన్నారు. బస్టాండు నుంచి పలు ఆస్పత్రులకు అత్యవసర చికిత్స కోసం ప్రజలు వెళ్లాలన్నా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆటోలు, రోగులను తీసుకొచ్చే వాహనాలు సకాలంలో ఆస్పత్రులకు చేరుకోలేక నానా కష్టాలు పడుతున్నారు. దీనికితోడు కళాశాలకు వెళ్లే విద్యార్థినులను ఆకతాయిలు అక్కడే మకాం వేసి వేధింపులకు గురిచేస్తున్నారు. దారికి అడ్డంగా ద్విచక్ర వాహనాల ఉంచి ఇదేమిటని ప్రశ్నించే ప్రజలపై నిత్యం వాగ్వివాదాలు, ఘర్షణలకు దిగుతుండడం పరిపాటిగా మారింది. అధికారులు స్పందించి తగు చర్యల చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



బజారువీధికి వెళ్లే మార్గంలో అడ్డంగా ఉంచిన ద్విచక్రవాహనాలతో మూసుకుపోయిన దారి

డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత మెటీరియల్ అందజేత

కలికిరి: స్థానిక గ్రంథాలయంలో అధికారి విజయ్ కుమార్ ఆదివారం మండల పరిధిలోని డీఎస్సీ అభ్యర్థులకు ఉచితంగా డీఎస్సీ మెటీరియల్‌ను అందజేశారు. చిత్తూరు పట్టణానికి చెందిన కుట్టి డీఎస్సీ కేంద్రం వారు నిరుద్యోగ అభ్యర్థుల సౌకర్యం నిమిత్తం మెటీరియల్ వితరణ చేశారని, అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కుట్టి డీఎస్సీ కేంద్రం నిర్వాహకులు పాల్గొన్నారు.

వైభవంగా చక్రస్నానం



వసంతోత్సవ కార్యక్రమంలో వేదపండితులు

తంబళ్లపల్లె: కోసువారిపల్లెలోని శ్రీ ప్రసన్న వెంకటరమణస్వామి ఆలయంలో 10 రోజులుగా టీటీడీ ఆధ్వర్యంలో స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం ఉదయం ఉపప్రధాన అర్చకులు కృష్ణప్రసాద్‌బట్టార్, అర్చకులు రమేష్‌లు స్వామికి ప్రత్యేక అలంకరణ చేసి వసంతోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం వేద పండితులు చక్రస్నానం నిర్వహించారు. రాత్రి ధ్వజారోహణ కార్యక్రమం జరిగింది. టీటీడీ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో హరికథ, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

'సిద్ధం' సభకు భారీగా తరలిన శ్రేణులు

- వాహనాలకు జెండా ఊపి ప్రారంభించిన నిసార్‌అహ్మద్
- వేలాదిగా వెళ్లిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు



మదనపల్లె: సిద్ధం సభకు వెళుతున్న బస్సులను జెండా ఊపి ప్రారంభిస్తున్న నిసార్‌అహ్మద్

మదనపల్లె : అనంతపురం జిల్లా రాప్తాడులో ఆదివారం నిర్వహించిన సిద్ధం సభకు మదనపల్లె నియోజకవర్గం నుంచి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. నియోజకవర్గ సమన్వయకర్త నిసార్‌అహ్మద్ నేతృత్వంలో మదనపల్లె మున్సిపాలిటీ, మండలం, నిమ్మనపల్లె, రామసముద్రం మండలాల నుంచి సిద్ధం సభకు వెళ్లేందుకు పెద్దసంఖ్యలో ప్రజలు వచ్చారు. స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు ఏర్పాటుచేసిన బస్సుల్లో సిద్ధం సభకు బయలుదేరారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద నియోజకవర్గ సమన్వయకర్త నిసార్‌అహ్మద్ వాహనాలను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...పేదవాడికి, పెత్తందారులకు మధ్య జరుగుతున్న యుద్ధంలో జగనన్నకు అండగా నిలిచేందుకు రాప్తాడు సిద్ధం సభకు జనప్రభంజనం కదిలిందన్నారు. పేదలను కన్నబిడ్డల్లా, వారి సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తుండటంతో... దేశం మొత్తం ఇలాంటి నాయకుడు కావాలని కోరుకుంటున్నారన్నారు. జగనన్న చెపితే...తప్పకుండా చేస్తారనే నమ్మకం అందరిలో ఉండటంతో మళ్లీ సంక్షేమ ప్రభుత్వాన్ని ఎన్నుకునేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ తదితర ప్రతిపక్షాలన్నీ ఏకమైనా... వైఎస్సార్ సీపీ ఫ్యాన్ ప్రభంజనం ముందు తట్టుకోలేవన్నారు. 2024లో రాష్ట్రంలో అత్యధికస్థానాల్లో వైఎస్సార్ సీపీ విజయకేతనం ఎగురవేయడం, మళ్లీ జగనన్న ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు. నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ కార్యకర్తలు ప్రతి ఇంటికీ వెళ్లి జగనన్న పాలనలో ఆయా కుటుంబాలకు కలిగిన లబ్ధిని వివరిస్తూ..మంచి జరిగి ఉంటేనే మన ప్రభుత్వానికి ఓటువేయాలని కోరాలన్నారు. మార్కెట్‌కమిటీ చైర్‌పర్సన్ తట్టిశ్రీనివాసులురెడ్డి నేతృత్వంలో తట్టివారిపల్లె, కొండామర్రిపల్లె పంచాయతీల నుంచి, వైఎస్సార్ సీపీ యువనాయకులు కత్తిమంజు ఆధ్వర్యంలో రామాచార్లపల్లె నుంచి యువకులు సిద్ధం సభకు బయలుదేరి వెళ్లారు. కార్యక్రమంలో కౌన్సిలర్ బి.ఏ.ఖాజా, మేస్త్రీశ్రీనివాసులు, జేసీఎస్ కన్వీనర్లు మునిశేఖర్, బావాజీ, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



కలికిరి నుంచి సిద్ధం బహిరంగ సమావేశానికి..

కలికిరి నుంచి..

కలికిరి: అనంతపురం జిల్లా రాప్తాడులో జరిగిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి బహిరంగ సమావేశానికి మండలం నుంచి పెద్ద ఎత్తున వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంతో బయల్దేరి వెళ్లారు. సుదూర ప్రాంతం అని లెక్క చేయకుండా ప్రతి గ్రామం నుంచి వందలాదిగా కార్యకర్తలు తమ సొంత వాహనాల్లో సైతం సమావేశానికి చేరుకున్నారు. కార్యక్రమాల్లో మార్క్‌ఫెడ్ మాజీ చైర్మెన్ నల్లారి తిమ్మారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రమేష్ కుమార్ రెడ్డి, నాయకులు వెంకటరెడ్డి, రత్నశేఖర్‌రెడ్డి, మధసుదన్‌రెడ్డి, రెడ్డెప్ప, హనీఫ్, రియాజ్ అహ్మద్, ఇస్తియాక్, శివాజీ, శ్రీకాంత్, వెంకటపతి, మల్లికార్జున, భోగేష్, అజయ్, ఖాదర్‌బాషా, ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

కలకడ నుంచి..

కలకడ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బహిరంగ సమావేశానికి మండలం నుంచి అధికంగా అభిమానులు కదలి క్యూ కట్టారు. ప్రత్యేక బస్సులు, కార్లు, ఇతర వాహనాల ద్వారా జై జ.గన్, జైజై జగన్ నినాదాలు చేసుకుంటూ కదిలారు. ఎంపీపీ శ్రీదేవి, కన్వీనర్ కమలాకర్‌రెడ్డి, సింగల్‌విండో అధ్యక్షులు వెంకట్రమణరెడ్డి, సచివాలయ కన్వీనర్ మోహన్‌రాజ్, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, తదితరులు ప్రత్యేక వాహనాలలో వెళ్లారు.

ప్రజల ఆదరణ మరువలేం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి

బి.కొత్తకోట: సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సభ ఎక్కడ జరిగినా ఆ సభ విజయవంతం చేసేందుకు తంబళ్లపల్లె నియోజకవర్గ ముందుంటోందని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి అన్నారు. ఆదివారం అయన మాట్లాడుతూ 2022 నవంబర్ 30న మదనపల్లెలో జరిగిన సీఎం సభకు తంబళ్లపల్లె నుంచి ప్రజలు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు అత్యధిక సంఖ్యలో హాజరై రికార్డు సృష్టించారన్నారు. మళ్లీ రాప్తాడు సిద్ధం సభకు కూడా అదే ఆదరణ చూపి తరలివచ్చారని అన్నారు. ప్రజలు, పార్టీ శ్రేణులు చూపించిన ఆదరణ మరువలేమన్నారు.

తంబళ్లపల్లె నియోజకవర్గం నుంచి..

అనంతపురం జిల్లా రాప్తాడులో ఆదివారం నిర్వహించిన సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సిద్ధం సభకు తంబళ్లపల్లె నుంచి వైఎస్సార్‌సీపీ శ్రేణులు భారీస్థాయిలో తరలివెళ్లారు. ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచి పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు సందడిగా బయలుదేరి వెళ్లారు. ప్రతిపంచాయతీ నుంచి ప్రత్యేక బస్సుల్లో వెళ్లారు. 150 దాక బస్సులు, 100 కుపైగా కార్లలో ఆయా గ్రామాల నుంచి తెల్లవారుజాము నుంచే బయలుదేరారు. కార్లు, బస్సులపై పార్టీ జెండాలు, పాటలతో సందడి చేస్తూ వెళ్లారు. మార్గమధ్యంలో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలను కలుస్తూ వారిలో ఉత్సాహం నింపుతూ వెళ్లారు.

వాల్మీకిపురం నుంచి..

వాల్మీకిపురం: అనంతపురం జిల్లా రాప్తాడులో జరిగిన సిద్ధం సభకు వాల్మీకిపురం మండల వ్యాప్తంగా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలివెళ్లారు. మండలం నుంచి 30 బస్సుల్లో జగన్ సభకు తరలివెళ్ళడం గమనార్హం. పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, ఎండిసి డైరెక్టర్ హరీష్ రెడ్డి ఏర్పాటు చేసిన సిద్ధం చైతన్య రథం సభా ప్రాంగణంలో ఆకర్షణగా నిలిచింది. ఎమ్మెల్యే చింతల మాట్లాడుతూ రాయలసీమ స్థాయిలో కనీవిని ఎరగని రీతిలో సిద్ధం సభను చూసి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కేశవ రెడ్డి, నీళ్లభాస్కర్, మదనమోహన్‌రెడ్డి, రాజేష్, రఘు, శ్రీనివాసులు, రాజన్న, ఆనంద తదితరులు పాల్గొన్నారు.

పెద్దతిప్పసముద్రం నుంచి..

పెద్దతిప్పసముద్రం: అనంతపుం జిల్లా రాప్తాడులో ఆదివారం జరిగిన సిద్ధం బహిరంగ సభకు మండలంలోని వైఎస్సార్‌సీపీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, వైఎస్సార్‌సీపీ కుటుంబ సభ్యులు అధిక సంఖ్యలో తరలి వెళ్లారు. జన సమీకరణతో ప్రజలంతా వాహనాల్లో భారీగా తరలి వెళ్లారు.